# కన్పించడం లేదు

దండమూడి మహీధర్



కన్పించడంలేదు. మావాడు కన్పించడం లేదు అంటే నా తమ్ముడు. వాడు ఇల్లు విడిచి వెళ్ళిపోయి వారంరోజులైంది. ఇదివరలోకూడా మావాడు తరచు పారిపోతూ వుండేవాడు. మళ్ళా వాడే తిరిగొస్తూ వుండేవాడు. కాని ఇప్పుడు పారిపోవడంవల్ల ఒక ప్రమాదం వచ్చింది అందుకే మానాన్న నావద్దకు పరుగెత్తుకవచ్చి పత్రికలో 'కన్పించడం లేదు' అనే ప్రకటన యివ్వమన్నాడు

అసలు నిజంచెప్పాలంటే మా నాన్నె వాణ్ణి చెడగొట్టాడు. ఈ రోజులలో మగపిల్లలను నెత్తికెక్కించుకుంటే మాట వింటారటండీ? మావాడు ముచ్చటగా మూడుసార్లు యస్ యస్. యల్ సి పరీక్షల్లో బ్రహ్మాండంగా దండయాత్ర కొట్టాడు మా నాన్న మాట్లాడలేదు. ఎలాగో నాలుగవ పర్యాయం ప్యాసై కాలేజీలోచేరి ఇంటర్ చదివాడు. ప్రతిసారీ పోవడమే' అప్పుడుకూడా నాన్న కిమ్మనలేదు 'పరీక్ష పోతే పోయిందిలే!... పెద్దవాడు ఎలాగూ ఉద్యోగమని ఊళ్ళు తిరుగుతున్నాడు, నువ్వయినా ఇంటిపట్టునవుండి వున్న పదెకరాల కొంప్రను కనిపెట్టుకొని వుండరా!,' అని అనడంతో వాడికళ్ళు మరీ నెత్తికెక్కినాయి.

ఇంటిపట్టునవుండి వాడేనా పొలాన్ని కనిపెట్టుకొని వుండేది? పనంతా మళ్ళా ముసలాయనే చూసేవాడు! పదీ, పరక

డబ్బు చేతికిరావడం ఆలస్యం; గుడివాడ పరుగెత్తి వున్న నాలుగు సినిమాలు చూసి రెండోరోజు మధ్యాహ్నానికి ఇంటికి చేరడం అలవాటు చేసుకున్నాడు

వీడికేదో పెద్ద ఆదర్శాలున్నట్టు— 'పెళ్ళిరా' అని మానాన్న అంటే 'వద్దు నాన్నా! అప్పుడే నాకెందుకు పెళ్ళి'? అని నంగనాచి కబుర్లు చెబుతాడు. వీడి వేషాలు ఎవరికి తెలియవు! ఆ ముసలాయనకు తెలియవు' అందుకే వాడంటే మహాగారాబం! మరి చిన్నవాడుకదూ? ఇక మా అమ్మవిషయం చెప్పనే అవసరంలేదు

అసలు క్రిందటిసారి పారిపోయినప్పుడే నేను, నాన్నా — అమ్మను—వడ్ల డబ్బు వాణ్ణి తెమ్మని చెప్పడమేమిటని కోప్పడ్డాను వాడు తిరిగొచ్చాడని తెలిసి వెళ్ళి 'ఏమిటిరా ఈ పనులు? చేతికి డబ్బు దొరికిందని ఇష్టం వచ్చిన చోటికెల్లా వెళ్ళి జల్సా చేసివస్తే నలుగురూ చూసి ఏమంటారో నీకు తెలుసునా? పైగా పెళ్ళి కావలసిన వాడివి!...' అని మందలించాను.

'వండర్ ఫుల్' అన్నాడు వాడు. బొంబాయి నగరం అత్యద్భుతమైనదన్నాడు. 'మెరీన్‌డ్రైవ్'అన్నాడు 'హేంగింగ్ గార్డెన్స్' అన్నాడు. 'మలబార్ హిల్స్' అన్నాడు. 'ఇండియా గేట్' అన్నాడు. ఏదేదో చెప్పి చివరకు నాకోసం బొంబాయిలో వాడు తెచ్చిన 'వులెన్



ఇందులోనివి చెప్పులులే! మొన్న మేం "సత్య హరిశ్చంద్ర" నాటకం ప్రదర్శించాముగా ఆ సందర్భములో

సూటింగ్' నాముందుంచాడు. ఇక వాణ్ణి నేనేమనాలి? ఐదొందల రూపాయలు ఖర్చు పెట్టుక వచ్చాడు. ఈ పర్యాయం వాడు డబ్బేమీ పట్టుక వెళ్ళలేదు. మా నాన్న, అమ్మకు ఆదే చింత పట్టుకున్నది 'ఎక్కడ వున్నాడో, ఎన్నెన్ని బాధలు పడుతున్నాడో నా బిడ్డ!' అని ఉదయం వచ్చినప్పటినుంచి ఇద్దరూ ఒకటే గోల! వాళ్ళు ఇంత హుటాహుటిని విజయవాడ పరుగెత్తుక రావడంలో యిమిడివున్న అసలు రహస్యమేమిటంటే మా వాడికి పెళ్లి కుదిరింది. పాతిక వేలు కట్నం! పెళ్ళి పేరు చెబితే పారిపోయే మగవాణ్ణి నే నెక్కడా చూడలేదు. ఇష్టం లేకపోతే చెప్పవచ్చును గదా! అంతేగాని ఇంట్లో చెప్పా పెట్టాకుండా దేశాలమీద బడిపోతే నలుగురూ నానా మాట లనరూ? ఇంతకూ వాణ్ణి అనే పనిలేదు నాన్నా, అమ్మా వాణ్ణి నెత్తి కెక్కించుకున్నారు. ఇరవయ్ ఏళ్ళు వచ్చినా వాళ్ళ దృష్టిలో వాడింకా పసివాడేనట! 'బిడ్డ చక్కలంవలె

ఎండిపోయాడంటే చక్కిలాలు ఇమ్మని ఏడ్చాడట ! ఆ బాపతువాడు మా వాడు

ఉదయం అమ్మా, నాన్న వచ్చినప్పటి నుంచి ఒకటే గొడవ — పత్రికలో 'కన్పించటంలేదు' అని మా వాణ్ణిగురించి ప్రకటన ఇవ్వమని! ఎక్కడ నవ్విపోతారో నని నేను బాధపడుతూ వుంటే— 'నా బిడ్డ! నా బిడ్డ' అంటారు వాళ్ళు కడగొట్టు బిడ్డంటే ఇంత ప్రేమ కాబోలు !

పోరుపడలేక—ఉదయం పదిగంటలకు పత్రికాఫీసుకెళ్ళి 'కన్పించడం లేదు' అని ప్రకటన ఇచ్చాను మావాడి ఆచూకి తెలిపిన వారికి, లేదా పట్టి తెచ్చిన వారికి తగిన బహుమతి ఇవ్వబడుతుందని కూడా ఆ ప్రకటనలో ఇవ్వడం జరిగింది మా నాన్న నూటపదహారు రూపాయలు బహుమతిగా లభిస్తాయని వేయమన్నాడు గాని, అది నా కిష్టం లేకపోయింది అసలు ప్రకటన ఇవ్వడమే నాకు యిష్టంలేదు వాడే తిరిగొస్తాడని ఎంత చెప్పినా వినలేదు అవతల పిల్ల తరఫువాళ్ళు తొందర పడుతున్నారట! ఆ తరువాత ముహూర్తాలు లేవట !

మరొక విషయం చెప్పడం మరచాను ప్రకటనతోపాటు ఫోటోకూడా అచ్చు వేయించమని ఇచ్చాను. నిజం చెప్పాలంటే ఆ ఫోటో మాతమ్ముడిది కాదు, అది నా ఫోటో ! అయితే మా ఉభయుల పోలికలు ఒకేరీతిగా వుంటాయిగనుక, ఆ ఐడియా మా నాన్నకు తట్టింది. నా దుంప తెంచుతారేమో,, ఎందుకునాన్నా నా ఫోటోఇవ్వడమంటే వూరుకుంటేనా? 'ఆ ప్రకటన అలా యిచ్చి నీపని నీవు చూసుకో!' అని అన్నాడు నాన్న, నన్ను పత్రికాఫీసుకు పంపిస్తూ.

కాని ఆ ప్రకటన యిచ్చాక ఆఫీసుకు వెళ్ళడం నాకిష్టం లేకపోయింది. కొంపతీసి పత్రికలో ఫోటోచూసి జనం నావెంటబడితే ఏంగాను? ఆఫీసుకు శలవు బెట్టి, అక్కడా, ఇక్కడా కొంచెంసేపు కాలక్షేపంచేసి ఒంటిగంట ప్రాంతాన ఇంటికి తిరిగి వచ్చాను

మానాన్న మూలమీద కూర్చున్నాడు. నన్ను చూడడంతోటే—'ఎక్కడరా నారాయణరావు?' అన్నాడు, నేనువాణ్ణి జేబులో పెట్టుకొచ్చినట్టు ! 'పత్రికలవాళ్ళు ప్రకటనలు అచ్చువేయటం వరకేగాని, మనిషిని వెదికి మనకు అప్పగించరు! ఆ పని పోలీసులు చేస్తారు. మరి పోలీసు స్టేషన్‌లో రిపోర్టు ఇవ్వాలంటే—మనవాడి మీద నేరాలు ఆరోపించాలి—వాడు ఇంట్లో నుంచి ఏ ఐదువేల రూపాయలో కాజేసుకొని వెళ్ళాడని''

మా నాన్నకు కోపం వచ్చింది

'ఐదువేలు ఎందుకయిందిరా? వెయ్యి రూపాయిలేగా? ... అయినా పోలీసు రిపోర్టు ఎందుకులే! పత్రికాప్రకటన చాలు' అని అన్నాడు, మా నాన్న!

మావాడు గ్రంధసాంగుడే ఇంటర్‌లో వాడు తెలుగులో రెండుసార్లు తప్పితే

తెలుగు లెక్చరర్ దగ్గర ట్యూషన్ కుదర్చగా—మావాడు అసలు పాఠాలు వదిలేసి ఆయన కూతురువద్ద ప్రేమపాఠాలు నేర్చుకున్నాడు చెడిపోయాడు పెళ్ళి అనగానే పారిపోయాడు

ఇంత జరిగినాకకూడా మా నాన్నకు వాడిమీద రవ్వంతయినా ప్రేమ తగ్గలేదు ఆ చేసే పెళ్ళి ఆ తెలుగు లెక్చరర్ కూతురితోనే చేస్తే పోయేదిగా ?... ఉహు(...కట్నం కావాలి' పేరు ప్రతిష్టలు కావాలి' మా తాతల కాలాలనుంచి వస్తున్న పేరు ప్రతిష్ఠలు! మా తాతలు నేతులు తాగారు, మా నాన్న వూళ్ళో పెత్తనం చెలాయించి, అడిగినవాడికి నోటూ పత్రం లేకుండా డబ్బిచ్చి, వాడికీ వీడికీ హామీవుండి వున్న ఆస్తిని కరిగింపజేసుకున్నాడు

అమ్మ వుదయం వచ్చినప్పటినుంచి వాడిలోని విశేషణాలు వల్లించడం మానలేదు! నేనూ ఒప్పుకుంటాను వాడు చూడడానికి చాలా అందంగావుంటాడు, మంచి భారీశరీరం' ముక్కూ, నోరూ అన్నీ తీర్చి దిద్దినట్టు వుంటాయి వీటిని బట్టి కాదుగా మనిషి విలువను కట్టేది ? మనిషికి మంచితనం అనేది వుండాలి మా వాడిలో అది తప్ప తక్కిన సుగుణాలన్నీ వున్నాయి. ఊళ్ళో కుర్రవాళ్ళ నందరినీ చేర్చి చెరువు గట్టుమీది గ్రంథాలయం వెనుక పేకాట ఆడతాడు! ఐదు గంటల వేళ ఆ గ్రంథాలయం ముందున్న అరుగులమీద కూర్చొని కన్పించిన వాళ్ళ నందరినీ విమర్శించి వాళ్ళతో పోట్లాట పెట్టుకుంటాడు ఇక గుడివాడ వీధులలో వీడు నడవడం చూడాలి! ఆ ధీమా ఏమి చూసుకొనో, ఏమిటో మరి ' ఎందుకో తెలియదుగాని — చిన్నా, పెద్ద — ప్రతి వాళ్ళూ మావాణ్ణి చూసి ఆప్యాయంగా పలకరిస్తారు! హైస్కూలు మాష్టర్లతోను, కాలేజీ లెక్చరర్లతోను — వీడు, సమాన వయస్కులతో మాట్లాడినట్టు మాట్లాడతాడు' హాస పరిహాసాలాడతాడు, స్కూళ్ళూ కాలేజీలు ఎలా నడుస్తున్నాయని ప్రశ్నిస్తాడు' వీడి నిష్క్రమణతోనే స్కూళ్ళు కాలేజీలు పని చేయడం మానివేశాయని వీడి వుద్దేశ్యం కాబోలు '

వాడి నడత విషయంలో వేలెత్తి చూపడానికి వీల్లేదంటుంది, మా అమ్మ కాని నాకు మాత్రం నమ్మకంలేదు వాడి మంచితనం మీద' వచ్చిన చిక్కేమిటంటే నేను వాడి బాగోగులను గురించి ఎంత విచారిస్తానో, మా నాన్నకు, అమ్మకు వాడిమీద అంత నమ్మకం వాడి వంటి మీద ఈగ వాలడానికి వీల్లేదు

అయితే వాడు పొరపాటున కూడా సిగరెట్టు తాగడు. అదే మా వాడిలోవున్న విశేషమల్లా' దీనికొక చిన్నకథ వున్నది. ఆ కథను ఆసాంతంగా చెప్పి ఈ ప్రకటనను పెంచడం నా కిష్టంలేదు ఒక్క మాటలో చెప్పాలంటే ఆ తెలుగు లెక్చరర్ కూతురు మా వాడిని సిగరెట్లు

తాగడం మాన్పించేసింది లేకపోతే వాడు నా మాటా, మీ మాటా వింటాడా? అంతే మరి గురికుదిరితే — మగవాడు ఆడది ఏంచెప్పినా చేస్తాడు, అందులో మా తమ్ముడి లాంటి వాళ్ళు చూసిరమ్మంటే కాల్చి వస్తారు.

ఇదీ విషయం ఇకపోతే తెలుగు లెక్చరర్ కూతుర్ని గురించి వివరాలు ప్రకటించి, ఆయనకు, ఆయన కూతురికీ అన్యాయం చేయదలచుకోలేదు

ఈ ప్రకటన చూసిన వారెవరైనా సరే—మావాడి ఆచూకి తెలియజేసినా, లేదా పట్టియిచ్చినా వారికి తగిన బహుమతి లభిస్తుంది. మా నాన్న నూటపద హార్లు ఇస్తామంటున్నాడుగాని, నాలుగు కబుర్లు చెబితే ఆయన ఇట్టే ఉబ్బిపోయే మనిషి...మరొక పదో, పాతికో లభించ వచ్చును కూడా' ఆ మొహమాటం అక్కర్లేదు

విజయవాడలో సూర్యారావు పేట చివరన మొగల్రాజపురం వెళ్ళేరోడ్డు మీద, బారిష్టరుగారి మేడకు ఎదురుగావున్న సందుపక్క మలుపుమీదవున్న అరుగు మీద ఖద్దరు బట్టలు ధరించిన బట్టతల ముసలాయన ఒకాయన చుట్ట కాల్చు కుంటూ కూర్చొని వుంటాడు ఉదయం నుంచి, సాయంత్రందాకా' ఆయన జేబులో దాదాపు రెండు వందల రూపాయలు ఉంటాయి చేతిలో ఆరోజు దిన పత్రిక వుంటుంది. వచ్చేపోయే, మనుషుల వైపు ఆశగా చూస్తూవుంటాడు అక్కడికొచ్చి ఎవరైనా నిలబడితేచాలు— 'ఏవూరు బాబూ మనది?' అని సవాలక్ష ప్రశ్నలువేసి విసిగిస్తాడు. ఆ వేసే ప్రశ్నలుకూడా చుట్ట తాగుతూ, ఏదో ముక్తాయింపుగా వుంటాయి ఆయన 'ఆఁ' అనడానికి కూడా అరనిమిషం పడుతుంది ఆయనే మా నాన్న' ఎవరైనా సరే వచ్చి ఆయనను అక్కడ కలుసుకొని మావాడి ఆచూకి తెలిస్తే చెప్ప వచ్చును లేదా ఆకారానికి సంబంధించిన వివరాలు యింకా కావలసివుంటే ఆయనను వాకబు చేయవచ్చును

ఒరేయ్ నారాయణా! [ఈ ప్రకటన ఒకవేళ మా వాడి కంటబడుతుందనే నమ్మకంతో వాణ్ణి సంబోధిస్తున్నాను'] ఏమిటిరా ఈ పనులు? నలుగురికీ తెలిస్తే మన గౌరవం మంటకలసి పోదట్రా' ఆ పిల్లను పెళ్ళి చేసికుంటానంటే నాన్న అడ్డుపెట్టేవాడటరా?...అసలు నీవీ పాడు పనికి ఎందుకు పూనుకున్నావంట? సరే అయిపోయిందేదో అయిపోయింది తిరిగి వచ్చివెయ్! నీకు నచ్చిన పిల్లనే పెళ్ళి చేసుకో నాన్నా, అమ్మా నీ మీద బెంగ పెట్టుకొని వున్నారు. [కాని అబద్ధం! అమ్మ నిన్న సాయంత్రం సినిమాకు వెళ్ళింది. నాన్న బారిస్టరుగారింటి కెళ్ళి కబుర్లు చెబుతూ కాలక్షేపం చేస్తున్నాడు.] వస్తావు కదూ తక్షణం!

ఇట్లు నీ అన్న "మధు."